


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 3 సంచిక -88 శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-


Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

# కొండా సురేఖ ఔట్

## లోక్‌భవన్‌కు సీఎం రేవంత్ రెడ్డి : కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం

### ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు : సీఎం రేవంత్





**బర్తరఫ్ ఉత్తర్వులపై గవర్నర్ సంతకం**

**కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ**

**రాజీనామాకు నిరాకరించిన సురేఖ**

**బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్**

**గవర్నర్ కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ**

**సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..**

**చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు**

**హైదరాబాద్ సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు**మిగతా 2లో...**

# నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు



**నన్ను తొలగించడం కుట్రే..**

**రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు**

**బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు**

**కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను**

**నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని**

**రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు**

**బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా**

**నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి**

**బర్తరఫ్ పై మీడియా సమావేశంలో కొండా సురేఖ**

**అధిష్టానానికి పంపిన లేఖ కొండా సురేఖ రిలీజ్**

**హైదరాబాద్, సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);**మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు.**మిగతా 2లో...**

# రూ.5కోట్ల అక్రమాస్తులు..

## టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం అరెస్ట్

**లోకనాథం, ఆయన బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు**

**బంగారం, వెండి, విలువైన స్థలాలు గుర్తింపు**

**సోదాలు ముగిసిన వెంటనే అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు**



**తిరుపతి సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);**రుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఈవో లోకనాథంను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు, అనంతరం తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కార్యాలయానికి తరలించారు.**మిగతా 2లో...**

# ఉద్యమాల ఖిల్లా నుంచే.. గులాబీ గర్జన

**మిర్యాలగూడ సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);**
సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు నీటి విడుదల షెడ్యూల్‌ను ఈ నెల 14లోపు ప్రకటించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్దేశిత గడువులోగా షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలో బిఆర్ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కెటిఆర్ విమర్శించారు. ఎన్ని తడులు నీరు విడుదల చేస్తారు.. ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారు.వారబందీ విధానం అమలు చేస్తారా అనే అంశాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. 2003లో సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల కోసం కెసిఆర్ పాదయాత్ర చేసిన విషయాన్ని



గుర్తుచేస్తూ.. ఇప్పుడు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తాను కూడా పాదయాత్ర చేస్తానన్నారు. కాంగ్రెస్‌కు ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# వివేకా హత్య కేసులో ఈడీ దూకుడు

**: రూ. 40 కోట్ల డీల్‌పై అప్రూవర్ దస్తగిరి విచారణ**

**వివేకాను హత్య చేసేందుకు రూ. 5 కోట్ల ఒప్పందం చేసుకున్నట్టు దస్తగిరి వాంగ్మూలం**




**అమరావతి సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);**
మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీవ్రతరం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి మధ్య జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారిస్తున్నారు. వివేకా హత్య వెనుక ఆర్థిక మూలాలను,**మిగతా 2లో...**

# కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..



**సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్**

**ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి**

**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద**

**కుడా ఛైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్**

**బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం**

**హైదరాబాద సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. **మిగతా 2లో...**

# జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

**యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ**

**భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ**

**బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ**

**శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు**



2లో.

# మోదీని అడిగే దమ్ముందా?..

**తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్**

**మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన**

**కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్**

**తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ**

**మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన**

**ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్**

**హైదరాబాద్, సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే



హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు**మిగతా 2లో...**

# నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు

**మొదటిపేజీ తరువాయి**

తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపొమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్‌డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉందని అన్నారు. మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్‌డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు. మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు. తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు. తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు.

అధిష్టానం చర్యలకు ముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు వివరణాత్మక లేఖ రాశారు. తాజాగా ఆమె ఆ లేఖను బహిర్గతం చేశారు. 2026 ఆగస్టు 23న రాసిన ఈ లేఖలో తాను బీసీ మహిళా మంత్రిగా రాజకీయ అణచివేతకు గురవుతున్నట్లు వివరించారు. వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యేగా, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రిగా పనిచేస్తున్న ఆమె తనకు 31 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉందని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉందని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తన అధికారాలు క్రమంగా కుదించబడుతున్నాయని ఆమె ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు సీఎంఓ నుంచి నేరుగా జారీ అవుతున్నాయన్నారు. తనను సంప్రదించకుండా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వంటి ముఖ్యమైన అంశాల్లో తనకు సమాచారం కూడా ఇవ్వలేదని, సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి నిధులు ఒక్క రోజులోనే రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారని వివరించారు. శ్రీ రామనవమి సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫోటోను తొలగించడం తన గౌరవాన్ని దెబ్బతీసిందని అన్నారు.

# మోదీని అడిగే దమ్ముందా?..

మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.

బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.

తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు

## : సీఎం రేవంత్



హైదరాబాద్: **సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);** చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హైదరాబాద్ అభివృద్ధి, మెట్రో విస్తరణ, మౌలిక వసతులు, పేదల సంక్షేమంపై సీఎం పలు కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం కేవలం కొబ్బరికాయ కొట్టి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసిందని తెలిపారు.

**'ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ'**

పాతబస్తీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గతంలోనే చెప్పినట్లు ఇది ఓల్డ్ సిటీ కాదని.. 'ఒరిజినల్ సిటీ' అని అన్నారు. ఇక్కడి ప్రతి గల్లీ తనకు తెలుసని పేర్కొన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేయాలని అధికారులను ఈ వేదికగా ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అబ్దుల్లా బలాలా.. కళాశాల అభివృద్ధికి రూ.20 కోట్లు కోరగా.. రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రభుత్వం నిధులు ఇస్తుందని, అయితే ఏడాదిన్నరలోపు అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్య కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఓవైసీ దేశానికి మద్దతుగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ సిద్ధాంతాలు వేర్వేరుగా ఉండొచ్చని.. దేశభక్తి విషయంలో మాత్రం అందరం ఒక్కటేనని పేర్కొన్నారు. కేబుల్ బ్రిడ్జిని చూడాలంటే ప్రస్తుతం దుర్గం చెరువుకు వెళ్లాల్సి వస్తోందని సీఎం అన్నారు. అందుకే మీరాలం చెరువులో సుమారు 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు సేవలను పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల సమయంలో మెట్రోలో ప్రయాణిస్తూ ప్రజలను ఓట్లు అడుగుతామని వ్యాఖ్యానించారు.

**హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు**

హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. హిందువులు, ముస్లింలు కలిసి ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని సీఎం ఆరోపించారు. మూసీని అభివృద్ధి చేసి నగరంలో నైట్ ఎకానమీని ప్రోత్సహిస్తామని తెలిపారు. పేద ముస్లింలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, వనస్థలిపురం, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

హైదరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం భావిస్తోందని సీఎం అన్నారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ అడుగడుగునా అడ్డుపడుతున్నాయని విమర్శించారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని.. ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి అన్నారు. అందరూ కలిసి హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

**ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరు: సీఎం**

ఈ క్రమంలో సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తనను ఎవరూ ధమ్కీ ఇచ్చి భయపెట్టలేరని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు, బెదిరింపులకు తాను లొంగే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారు. తనను ప్రేమతో మాత్రమే గెలవగలరని, ఒత్తిళ్లకు తాను తలవంచనని సీఎం పేర్కొన్నారు.

# రూ.5కోట్ల అక్రమాస్తులు..

**మొదటిపేజీ తరువాయి**

నిన్న ఉదయం నుంచే తిరుపతి ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి లోకనాథం నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ విస్తృత సోదాలు నిర్వహించారు. సుదీర్ఘంగా సాగిన ఈ తనిఖీల్లో దాదాపు రూ. 5 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. తనిఖీల సమయంలో ఆయన నివాసంలో 2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండి, రూ. 12.50 లక్షల ద్రవ్య నగదును స్వాధీనం చేసుకున్నారు.

వీటితో పాటు ఆయన భార్య, కుమారుడి పేర్లతో పలుచోట్ల ఇళ్లు, విలువైన స్థలాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. నిన్న ప్రారంభమైన సోదాలు ముగిసిన వెంటనే, ఈరోజు ఆయనను అరెస్ట్ చేశారు. టీటీడీ కీలక అధికారిని ఏసీబీ అరెస్ట్ చేయడం ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో తీవ్ర కలకలం రేపింది.

# వివేకా హత్య కేసులో ఈడీ దూకుడు

**మొదటిపేజీ తరువాయి**

మనీ లాండరింగ్ కోణాన్ని వెలికితీసేందుకు ఈడీ ఈ దర్యాప్తును వేగవంతం చేసింది.

హత్య వెనుక ఎర్ర గంగిరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలతో పాటు మరికొందరి మధ్య రూ. 40 కోట్ల డీల్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ఈడీ అధికారులు దస్తగిరిని ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత అనుమానాస్పదంగా జరిగిన బ్యాంకు లావాదేవీల చిట్టాను బయటకు తీస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు దస్తగిరి తన బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్లతో విచారణకు హాజరయ్యారు. గతంలో సీబీఐ విచారణ సందర్భంగా... వివేకాను హత్య చేసేందుకు తనకు రూ. 5 కోట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. నాటి సీబీఐ స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని, ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరి ఖాతాల్లోకి బదిలీ అయిందనే విషయాలపై ఈడీ ఆరా తీస్తోంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద చేపడుతున్న ఈ విచారణతో వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సూత్రధారుల చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది.

# కొండా ఔట్

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

**మొదటిపేజీ తరువాయి**

అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు. జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది.

భారత్-ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది.

## బయ్యారం మండల ప్రజలకు

# శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు.

**-పెద్దినేని వెంకటేశ్వరరావు.**



**బయ్యారం/సెప్టెంబర్ 3.(జర్నలిస్ట్ వార్త);**
శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా బయ్యారం మండల ప్రజలకు కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పెద్దినేని మాట్లాడుతూ ఆ శ్రీకృష్ణ భగవానుడు మన అందరి కుటుంబాలను ఆనందంతో,ఆరోగ్యంతో,ఐశ్వర్యంతో ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడిని స్మరించుకోవడం అంటే మన కర్తవ్యాన్ని మనం గుర్తుచేసుకుని ముందుకు సాగడమేనని అన్నారు.ఏ విషయంలో అయినా మనకు స్ఫూర్తినిచ్చే శ్రీ కృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో మనం విజయం సాధించవచ్చాన్నారు.కృష్ణాష్టమి సందర్భంగా ఆ నీలమేఘశ్యాముని కృపా,కటాక్షం మనందరిపై సదా ఉండాలని కోరుకుంటున్నట్లు పెద్దినేని తెలిపారు.

# నూతన పెట్రోల్ పంపు ప్రారంభం





**వర్ధన్నపేట/ సెప్టెంబరు 3(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట నియోజకవర్గంలోని డీసీ తండాలో తుమ్మల యాకయ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపు ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై పెట్రోల్ పంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెట్రోల్ పంపు అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంతాల ప్రజలకు, వాహనదారులకు ఇంధన సౌకర్యం మరింత చేరువ కానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీను, అన్వర్, వెంకట్, వెంకన్నతో పాటు పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# బీసీ కులగణనకు తక్షణమే చర్యలు

**జనాభా లెక్కలతో పాటు కులాల వారీగా గణించాలి**

**తహసీల్దార్ ద్వారా ప్రధాని మోదీకి మెమోరాండం**




**వర్ధన్నపేట/సెప్టెంబరు 3 3(జర్నలిస్ట్ వార్త);** జనాభా లెక్కలతో పాటు బీసీల కులాల వారీగా జనాభా గణన చేపట్టాలని కోరుతూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో వర్ధన్నపేట తహసీల్దార్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గురువారం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ పోషాల మధు మాట్లాడుతూ 1931 తర్వాత బీసీల కులగణన జరగలేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 ప్రకారం బీసీల జనాభా లెక్కలు తీసి, జనాభా నిష్పత్తి మేరకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల కులగణన చేపట్టకుండా ఎస్సీ, ఎస్టీ, ఇతరులు పేరుతో గణన చేపట్టాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల శ్రీనివాస్, పిట్టల భాస్కర్, బొచ్చు యాదగిరి, సంగినేని భీమ్‌రాజు, ఎలిశాల రాజేష్, బొడ్డుపెల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరులో ఖోఖో సందడి

**మినీ స్టేడియంలో మండలస్థాయి పోటీలు ప్రారంభం**



**కల్లూరు/సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త);**ముువ్వ విజయబాబు జన్మదినం సందర్భంగా కల్లూరు మినీ స్టేడియంలో మండలస్థాయి హైస్కూల్ బాలుర ఖోఖో పోటీలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు కాటేపల్లి కిరణ్‌కుమార్, మట్టూరు జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్‌నాయక్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్‌చౌదరి ప్రారంభించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆశీస్సులతో, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని అతిథులు సూచించారు.పోటీల్లో విజేతలైన నాలుగు జట్లకు ఈ నెల 6న బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్‌లో రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పొదిలి పద్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోట్రు అర్జున్‌రావు, నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యం

**రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి -రైతులకు అవగాహన కల్పించిన అధికారులు**





**వర్ధన్నపేట /సెప్టెంబర్ 3(జర్నలిస్ట్ వార్త):**
ప్రకృతి వ్యవసాయంతో రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి పి. విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలో ని చంద్రుతండా గ్రామపంచాయతీలో గురువారం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, సహజ వనరుల వినియోగం, నేల ఆరోగ్యం, జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల నిర్వహణపై అధికారులు వివరించారు. ద్రవ జీవామృతం తయారీపై రైతులకు ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. 10 కిలోల తాజా ఆవుపేడను 180 లీటర్ల నీటిలో కలిపి, 810 లీటర్ల ఆవు మూత్రం, 1.52 కిలోల బెల్లం, 1.52 కిలోల శనగపిండి లేదా పప్పిండి, చెట్టు కింద మట్టిని కలిపి 23 రోజులపాటు కిణ్వ ప్రక్రియకు ఉంచే విధానాన్ని వివరించారు. సిద్ధమైన ద్రవ జీవామృతాన్ని ఎకరానికి సుమారు 200 లీటర్ల చొప్పున నీటిపారుదల ద్వారా అందించవచ్చని, పంట పరిస్థితిని బట్టి నెలకు ఒకటి లేదా రెండుసార్లు వినియోగించవచ్చని తెలిపారు. అగ్ని అస్త్రం, జీవామృతం వంటి సహజ పద్ధతుల వినియోగంపైనా శిక్షణ ఇచ్చారు. అనంతరం అధికారులు రైతుల పంట క్షేత్రాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. చీడపీడల నివారణ, పంటల నిర్వహణ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ సారంగం, వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్. శిరీష, చంద్రుతండా, రాందాన్‌తండా సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రైస్‌మిల్ ప్రారంభోత్సవానికి హాజరైన రవీందర్‌రావు

**ఐనవోలు మండల కేంద్రంలో ఘనంగా కార్యక్రమం**





**ఐనవోలు/సెప్టెంబరు 3(జర్నలిస్ట్ వార్త);**
హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో కావాటి స్వామి నూతనంగా ఏర్పాటు చేసిన రైస్‌మిల్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ మార్నేని మధుమతి హాజరై రైస్‌మిల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా రైస్‌మిల్ నిర్వాహకుడు కావాటి స్వామికి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, సునీల్, రాజశేఖర్, కంకర శీను తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10 లోగా బోనస్ వచ్చే వరి రకాలను రైతులు ఆన్లైన్ చేసుకోవాలి.

**-వ్యవసాయ అధికారి కే.రాజు.**





**బయ్యారం/సెప్టెంబర్ 3.(జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు బయ్యారం రైతువేదికలో విత్తన,ఎరువుల విక్రయదారులతో అవగాహన వర్క్‌షాప్ ను మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా సీడ్ సేల్స్ యాప్ లో ప్రభుత్వం సూచించిన ప్రాధాన్యత కలిగిన వరి రకాల వివరాల నవీకరణ స్థితిని సమీక్షించడంతో పాటు, నూతనంగా అమల్లోకి వచ్చిన ఫర్టిలైజర్ సేల్ యాప్ వినియోగంపై డీలర్లకు అవగాహన,శిక్షణ కల్పించారు.డీలర్లు వరి రకాల వివరాల డేటా నవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి సెప్టెంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు.అనంతరం డిజిటల్ క్రాప్ బుకింగ్ పురోగతిపై డీసీఎస్ వాలంటీర్లతో సమీక్ష నిర్వహించారు.పెండింగ్‌లో ఉన్న క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ 30వ తేదీలోగా పూర్తి చేయాలని వారికి సూచించారు.విత్తన,ఎరువుల డీలర్లు రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరారు.ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు సూరం సుధాకర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు అఖిల్, ఫయాజ్, రెడ్యానాయక్,నాగరాజు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 9న చలో వరంగల్ ను విజయవంతం చేయాలి

**అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ఉద్యమిద్దాం బిర్రు మహేందర్ మాదిగ**





**వలిగొండ/ సెప్టెంబరు 3(జర్నలిస్ట్ వార్త)**సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న సెప్టెంబరు 9న చలో వరంగల్ ఎమ్మార్పీఎస్ఎమ్మెస్పీ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ఎమ్మెస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. వలిగొండ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారుపద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు రద్దయిన మండల, జిల్లా కమిటీల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు.ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు, భువనగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దుబ్బ రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అసమానతలపై భవిష్యత్‌లో ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**నూతన మండల కమిటీల ఎన్నిక**

అనంతరం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మెస్ఎఫ్ వలిగొండ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కందుల నరేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా బూడిద భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కందుల శివ మాదిగ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కోరబోయిన మహేందర్ మాదిగ, సుదర్శన్, పల్లెర్ల నరసింహ, కార్యదర్శిగా దుబ్బ శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా వెంకటగల మహేష్ ఎంపికయ్యారు.ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా పల్లెర్ల రామచందర్ మాదిగ, అధికార ప్రతినిధిగా రవి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, సర్పంచులు, బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఆహారంపై ఆరోపణలు

## ఐదుగురు చిన్నారులకు అస్వస్థత.. ఆస్పత్రిలో చికిత్స






**సత్తుపల్లి/ సెప్టెంబర్3 (జర్నలిస్ట్ వార్త):**సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఆహారం తీసుకున్న ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.స్థానికుల సమాచారం మేరకు.. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు వడ్డించిన పప్పుకూరలో గన్నేరు ఆకులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆహారం తీసుకున్న అనంతరం ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. దీంతో తల్లిదండ్రులు వారిని సత్తుపల్లి, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.ఘటనకు సంబంధించి ఆహారంలో గన్నేరు ఆకులు ఉన్నాయన్న విషయం వాస్తవమా? చిన్నారులు అస్వస్థతకు కారణమేంటి? ఆహార నాణ్యతను సిబ్బంది పరిశీలించారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. చిన్నారులకు అందించే ఆహార నాణ్యత, భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# విమర్శలు కాదు.. ప్రజా సంక్షేమమే మా ఎజెండా

## కేసముద్రంలో కాంగ్రెస్ 1000 రోజుల పాలన విజయోత్సవాలు



**కేసముద్రం/సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల మురళి ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ప్రజలకు చేరువవుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నేతలు అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల పక్షాన మాట్లాడుతున్నట్లు నటించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ పనితీరే తమకు ప్రజల మద్దతును మరింత పెంచుతోందని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంబటి మహేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బండారు వెంకన్న, బండారు దయాకర్, కౌన్సిలర్ ధారావత్ కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చిదురాల వసంతరావు, ఓలం రమేష్, ఎండీ అయూబ్‌ఖాన్, చింతకుంట్ల యాదగిరి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కనుకుల రాంబాబు, వల్లందాస్ రవి, బాధ్య నాయక్, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# సెయింట్ జాన్స్‌లో ఘనంగా జన్మాష్టమి వేడుకలు

## మత్తు, జూదానికి యువత దూరంగా ఉండాలి: ఫాదర్ శ్రావణ్‌కుమార్

**కేసముద్రం/సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):**
శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కేసముద్రంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శ్రీకృష్ణ అష్టోత్తర నామావళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఫాదర్ శ్రావణ్‌కుమార్, అఖిల్ ఆధ్వర్యంలో, లిల్లీ సిస్టర్ పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ అష్టోత్తర నామావళిని పఠించారు. విద్యార్థి చంద్రశేఖర్‌నాయక్ శ్రీకృష్ణుడి వేషధారణలో ఆకట్టుకోగా విద్యార్థినులు గోపికల వేషధారణలో సందడి చేశారు.ఈ సందర్భంగా ఫాదర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. మతాలు, గ్రంథాలకంటే మానవత్వమే అత్యున్నతమని అన్నారు. నీతి, న్యాయం, ధర్మం, ప్రేమ, దయ, విశ్వాసం వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. శ్రీకృష్ణుడు ధర్మం వైపు నిలిచి విజయాన్ని సాధించారని, నేటి సమాజంలోనూ ధర్మమే గెలవాలని ఆకాంక్షించారు.యువత మత్తు పదార్థాలు, జూదానికి బానిసలు కాకుండా వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి సమస్యకు విద్యే పరిష్కారమని, ఉన్నత విద్యతోనే దేశ సమగ్ర




అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని సన్మార్గంలో నడిపించాలని కోరారు. విద్యార్థులను ధర్మం, దేశభక్తి వైపు నడిపిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడమే ఉపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, దేవ్, నరేష్, షోరెడ్డి, అరుణ్‌కుమార్, ఐలయ్య, ఎల్బీ నాయక్, వేణుగోపాల్, మహేష్, రమేష్, రోజా, షాహిని, చైతన్య, శ్వేత, యామిని, బస్సు డ్రైవర్లు ఉపేందర్, హరీష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# రైతు సమస్యలపై బీఆర్ఎస్ రైతు గర్జన

## 400 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ.. సీతారామ జలాల కోసం పోరాటం




**కల్లూరు/ సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతులకు చేసిందేమీ లేదని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం కల్లూరులో భారీ రైతు ర్యాలీ నిర్వహించారు. చెన్నూరు నుంచి కల్లూరు సెంటర్ వరకు సుమారు 400 ట్రాక్టర్లతో సాగిన ర్యాలీలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సండ్ర మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా తల్లాడ, కల్లూరు ప్రాంత రైతులకు గోదావరి జలాలను పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఇరిగేషన్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, చెప్పులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టుకునే దుస్థితి వచ్చిందని విమర్శించారు. యూరియా పంపిణీకి యాప్ విధానం తీసుకువచ్చి రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.రైతుబంధు, రైతుబీమా, సీతారామ ప్రాజెక్టు వంటి కార్యక్రమాలు మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను 1000 రోజులు పూర్తయినా అమలు చేయలేదని ప్రశ్నించారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని సండ్ర స్పష్టం చేశారు.

# తల్లాడలో నూతన టిఫిన్ సెంటర్ ప్రారంభం



**తల్లాడ/సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండల కేంద్రంలోని కల్లూరు రోడ్డులో గల పంచాయతీ కాంప్లెక్స్ సముదాయంలో నూతన టిఫిన్ సెంటర్ శుక్రవారం ప్రారంభం కానుంది. ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారాన్ని అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రొప్రైటర్ షేక్ చాంద్‌బీ తెలిపారు.
ఇడ్లీ, వడ, దోశ, పెసరట్టు, బోండా, బజ్జీలతో పాటు ప్రత్యేకంగా ఎగ్ దోశను అందించనున్నట్లు పేర్కొన్నారు. రుచితో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. వివాహాలు, ఇతర శుభకార్యాలకు ముందస్తు ఆర్డర్లపై టిఫిన్లు అందిస్తామని వెల్లడించారు. ఆర్డర్ల కోసం 9959300270 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# నీళ్లివ్వకుంటే పాదయాత్ర!

## సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలి

## రైతుల కోసం మిర్యాలగూడలో కేటీఆర్ మహాసంగ్రామం



**మిర్యాలగూడ/సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):**
రైతుల సమస్యల పరిష్కారం, నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సాగునీటి విడుదల డిమాండ్‌తో మిర్యాలగూడ పట్టణంలో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాసంగ్రామం సభ నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ గాదరి కిశోర్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
సాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా సాగునీరు విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే వారం రోజుల్లో కోదాడ నుంచి మిర్యాలగూడ మీదుగా నాగార్జునసాగర్ వరకు పాదయాత్ర చేపడతామని ప్రకటించారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే సాగునీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

## క్యాన్సర్ ముప్పును తొలిదశలోనే గుర్తించాలి ఎమ్మెల్యే నాగరాజు



**హసన్‌పర్తి/ సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):** మహిళలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. ఐనవోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సింధు హాస్పిటల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కష్టతరమై ఖర్చులు పెరుగుతాయని తెలిపారు. శిబిరంలో అనుమానిత కేసులను గుర్తించి వారికి తదుపరి పరీక్షలు, చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.
అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో లభించే వైద్య సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను అన్ని మండలాల్లో నిర్వహించాలని సింధు హాస్పిటల్ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, సింధు హాస్పిటల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తెలగారంలో పాస్టర్ తిమోతి నూతన గృహప్రవేశం



**తల్లాడ/సెప్టెంబరు 3: (జర్నలిస్ట్ వార్త)**తల్లాడ మండలం తెలగారం గ్రామంలో పాస్టర్ పాము తిమోతి నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. డేవిడ్ నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని దైవసేవకులు, సేవకురాళ్లు, సంఘ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దైవవాక్య బోధన, ప్రభు భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ తిమోతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చర్చిల నిర్మాణానికి ఎవరైనా స్థలాన్ని ఉచితంగా లేదా సహకారంతో అందిస్తే, కుటుంబ సభ్యుల సహకారంతో చర్చిలను నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, దైవసేవకులు, సేవకురాళ్లు, విశ్వాసులు, సంఘ సభ్యులు పాల్గొని తిమోతికి శుభాకాంక్షలు తెలిపారు.

# అనిల్ నాయక్ నాయకత్వానికి యువత మద్దతు



**నర్సంపేట/సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడు బోడ అనిల్‌కుమార్ నాయక్ నాయకత్వాన్ని బలపరిచేందుకు యువత ముందుకు వస్తున్నారని పార్టీ నాయకులు తెలిపారు. చెన్నారావుపేట మండలం అమృతండా గ్రామపంచాయతీకి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు యువ నాయకులు గురువారం తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. వారికి అనిల్‌కుమార్ నాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా అనిల్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన పార్టీ విధివిధానాలను గ్రామగ్రామాన ప్రజలకు వివరించి, మహిళలు, రైతులు, యువతను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ప్రగతి, వ్యవసాయాభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కవితను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక
శుక్రవారం 4 సెప్టెంబర్ 2026

# ఓటు హక్కు పరిరక్షించుకోవాలి

## 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా సమర్పించాలి

## మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్/ సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):**



ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని బీఎల్ఓలకు అందజేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. గురువారం మహబూబాబాద్ పట్టణంలోని హనుమంతునిగడ్డ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్, పద్మశాలి భవన్ తదితర పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రస్తుతం ఓటర్లకు నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్నవారు నిర్ణీత గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని బీఎల్ఓలకు సమర్పించాలని సూచించారు.

**రోజువారీ వివరాలు నమోదు చేయాలి:** ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. చేపట్టిన కార్యక్రమం, పురోగతి వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంకా నోటీసులు అందని, ఓటరు నమోదుకు దూరంగా ఉన్నవారికి ప్రత్యక్షంగా లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వరి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉపేందర్, ఉప తహసీల్దార్లు నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి

## శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో ఘనంగా గోకులాష్టమి వేడుకలు




**కేసముద్రం/ సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో గోకులాష్టమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాకాంతం గౌడ్ మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. శ్రీకృష్ణుడి జీవితం నేటి సమాజానికి అనేక విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ధర్మం, నైతిక విలువలు, కర్తవ్యనిష్ఠను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిర్ర నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనకు వెయ్యి రోజులు

**జమ్మికుంట/సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జమ్మికుంట మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు వీరమనేని పరశురాంరావు ఆధ్వర్యంలో కోరపల్లి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. సుమారు 150 బైక్‌లతో జమ్మికుంట అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పరశురాంరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ధర్నాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దొగ్గల భాస్కర్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాచపల్లి సాగర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కుమార్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సుధీర్, సర్పంచులు జెక్క కిరణ్‌గౌడ్, పార్లపల్లి విజయ్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు గిరిజన శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వరరావుతో పాటు 20 గ్రామాల కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో కాంగ్రెస్‌కు షాక్..

## బీఆర్ఎస్‌లోకి కీలక నేతలు

**ఇల్లంతకుంట/సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):**



హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గొట్టే రాజశేఖర్, సిరిసేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు రేనుకుంట్ల జానీ బీఆర్ఎస్ గూటికి చేరారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతోందన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు. హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని, రానున్న రోజుల్లో పార్టీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన రాజశేఖర్, జానీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ వెంకటేష్, సిరిసేడు సర్పంచ్ కుమార్, దామోదర్, మాజీ ఎంపీటీసీ చిన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ రైతు ధర్నాపై కాంగ్రెస్ కౌంటర్

## మిర్యాలగూడలో భారీ నిరసన ర్యాలీ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై ధ్వజం

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనను చాటుతూ ప్లకార్డుల ప్రదర్శన

**మిర్యాలగూడ/సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహిస్తున్న రైతు మహాధర్నాకు వ్యతిరేకంగా మిర్యాలగూడలో కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వేలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన రైతు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులకు



జరిగిన అన్యాయాలు, అవినీతి, నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. రైతుల సమస్యలపై కేటీఆర్ చేస్తున్న ధర్నా రాజకీయ డ్రామా తప్ప మరొకటి కాదని విమర్శించారు. బీఎల్ఆర్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోని కేటీఆర్.. ఇప్పుడు రైతుల కోసం మహాధర్నా అంటూ రాజకీయ నాటకాలకు తెరతీయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. గత పదేళ్లలో రైతులకు ఏం చేశారో కేటీఆర్ ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్తామని నాయకులు పేర్కొన్నారు.

ర్యాలీలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాలువకు నీరివ్వకుంటే పంటల పరిస్థితేమిటి?

## అరకొర నిర్ణయాలతో రైతులకు అన్యాయం ఎస్సారెస్పీ నీటిని తక్షణమే విడుదల చేయాలి: బీఆర్ఎస్

**కేసముద్రం/ సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త)**

:ఎస్సారెస్పీ కాలువకు తక్షణమే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరకొర నిర్ణయాలతోనే రాష్ట్రంలో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గురువారం సప్పిడిగుట్టతండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతులకు సాగునీరు, సకాలంలో నాణ్యమైన విద్యుత్, ఎరువులు అందడం లేదని విమర్శించారు. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతోపాటు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులు, కుంటలను నింపాలని




డిమాండ్ చేశారు. శ్రీరాంసాగర్ నీటిని విడుదల చేసి భూగర్భ జలమట్టాన్ని పెంచితేనే రైతులకు కొంత ఊరట కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మర్రి రంగారావు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహమ్మద్ నజీర్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు గుగులోత్ వీరునాయక్, నాయకులు కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, మోడం రవీందర్‌గౌడ్, యాకూబ్‌రెడ్డి, ఈసం లక్ష్మీనారాయణ, గణపరపు రమేష్, పోలు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌హెచ్‌ఓను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్, కాంగ్రెస్ నేతలు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):**



ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన అనుముల శ్రీనివాస్‌ను ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల ఏరియా జ్యోతి ఆధ్వర్యంలో మండల, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల ఏరియా జ్యోతి మాట్లాడుతూ ధర్మసాగర్ మండలంలో ప్రజలకు పోలీసుల సేవలు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని అన్నారు. ఎస్‌హెచ్‌ఓ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులను సంప్రదించవచ్చని, వారి సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభం

## కాశగూడెం పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం వడ్డించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

## విద్యార్థుల ఆరోగ్యం ఏకాగ్రత మెరుగుదలే లక్ష్యమని వెల్లడి







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కాశగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఈ కార్యక్రమాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, కలెక్టర్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చొని అల్పాహారం చేశారు. పాఠశాల ప్రాంగణంలో రూ.12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు.

### ఆకలి లేకుండా విద్యాభ్యాసం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఉదయం ఆకలితో పాఠశాలకు వచ్చి చదువుపై దృష్టి కోల్పోకుండా ఉండేందుకు అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నట్లు కడియం శ్రీహరి తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతోపాటు చదువుపై ఏకాగ్రత పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

వారంలో వివిధ రోజుల్లో బోండా, పూరీ, ఉప్మా, ఇడ్లీ, వడ తదితర అల్పాహార పదార్థాలను అందించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.

### పాఠశాల అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదన

కాశగూడెం ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం సుమారు 90 మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. పాఠశాలను ఉన్నత ప్రాథమిక స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలన్న గ్రామస్థుల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కడియం శ్రీహరి చెప్పారు. అప్‌గ్రేడ్ అనంతరం అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయులు, ఇంగ్లిష్ మీడియం బోధనకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

### పేదలకు గృహాలు

అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో ఇళ్లులేని కుటుంబాలు, పూరిగుడిసెల్లో లేదా తాత్కాలిక నివాసాల్లో ఉంటున్న వారి వివరాలను అధికారులు, సర్పంచ్ కలిసి సేకరించి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాష్ట్రంలో రెండు విడతల్లో సుమారు ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కాశగూడెంలో ఇప్పటికే ఏడు ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు.

పునాది విద్యకు ప్రాధాన్యంవిద్యార్థుల పునాది విద్యను బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఐదో తరగతి నాటికి విద్యార్థులకు ప్రాథమిక ఇంగ్లిష్, గణితం, కూడిక, తీసివేత, గుణకారం వంటి అంశాల్లో ప్రాథమిక పరిజ్ఞానం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తున్నామని, పాఠశాలల్లో కంప్యూటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యలో వెనుకబడిన విద్యార్థుల కోసం అదనపు బోధన, రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

### గ్రామ అభివృద్ధిపై వినతులు

కాశగూడెంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయాలని, గ్రామపంచాయతీ భవనం ఏర్పాటు చేయాలని, గ్రామం పేరును కాసీనగర్‌గా మార్చే అంశాన్ని పరిశీలించాలని కడియం శ్రీహరి కలెక్టర్‌ను కోరారు. ఇప్పటికే రూ.11 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించామని, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలు మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండి, తమ ఆదాయాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ సత్తార్, డీఈవో గిరిరాజ్‌గౌడ్, తహసీల్దార్ బావ్‌సింగ్, ఎంపీడీవో అనిల్‌కుమార్, ఎంఈవో శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాస్మిన్ జహాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ ఎస్‌హెచ్‌ఓగా అనుముల శ్రీనివాస్ బాధ్యతలు

**ధర్మసాగర్/బ్యూరో సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా అనుముల శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై తిరిగి వచ్చి ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.




## ఎల్కతుర్తిలో ఘనంగా వెయ్యి రోజుల
# ప్రజా ప్రభుత్వం సంబరాలు

**ఎల్కతుర్తి/సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టి, అనంతరం సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నా ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎల్కతుర్తి మండల అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడుమహేష్‌కుమార్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్‌రావు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

# చిన్నారుల శ్రీకృష్ణ లీలలు



**కేసముద్రం/ సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం లిటిల్ సిటిజన్ యూపీఎస్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. చిన్నారుల ఆటపాటలు, నృత్యాలతో పాఠశాలలో సందడి నెలకొంది.విద్యార్థులతో పాటు గ్రామస్తులు, గృహిణులు, తల్లిదండ్రులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గోపికలతో కలిసి దాండియా నృత్యం చేస్తూ సందడి చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సరదాగా గడిపారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాయిలు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. చిన్నారులకు చిన్ననాటి నుంచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాయిలు శకుంతల, ఉపాధ్యాయులు జ్యోతి, రజిత, స్రవంతి, ప్రీతి, శివాని, ప్రశాంతి, ఫర్హానా, సౌజన్య, శిరీష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం..
# 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

**సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):**
గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి.తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి.ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు.నానక్‌రామ్‌గూడలోని లోథా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ◻

# కాంగ్రెస్ పాలనలో పేదలకు సంక్షేమ ఫలాలు

## వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ధర్మసాగర్‌లో సంబరాలు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో సెప్టెంబర్ 3 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ధర్మసాగర్ మండల కేంద్రంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెసర రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను కొనియాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుర్రపు ప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కాంగ్రెస్ పాలనలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా లభిస్తోందని పేర్కొన్నారు.గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు చేయాల్సిన పనులు చేయడంలో విఫలమయ్యారని గుర్రపు ప్రసాద్ విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై వచ్చిరాని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అధికారంలో ఉన్న




సమయంలో ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదలకు సమున్నత న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలిచి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెసర రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు ప్రజలతో కలిసి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు






**వర్ధన్నపేట/ సెప్టెంబరు 3(జర్నలిస్ట్ వార్త):**
పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ఫలాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేటలోని ఎంఎంఆర్ గార్డెన్స్‌లో గురువారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని తెలిపారు. రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం వంటి పథకాలను పేదలకు అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సులభంగా ప్రజలకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**కాంగ్రెస్ 1000 రోజుల పాలన సంబరాలు**

అనంతరం వర్ధన్నపేట కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాకాసులు కాల్చి, ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణిరాజేందర్, ఇల్లంద మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్‌రావు, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మానికి దారి చూపిన దివ్య సందేశం



**సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ వార్త):**
భారతీయ సంస్కృతిలో శ్రీకృష్ణ జన్మాష్టమికి ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారంగా భావించే శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్ర దినాన్ని భక్తులు కృష్ణాష్టమిగా జరుపుకుంటారు. శ్రావణ బహుళ అష్టమి రోజున, రోహిణి నక్షత్రంలో శ్రీకృష్ణుడు మథురలో దేవకీవసుదేవులకు జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి.
కంసుని అరాచక పాలనతో ప్రజలు బాధపడుతున్న సమయంలో ధర్మాన్ని రక్షించేందుకు, దుష్టశక్తులను సంహరించేందుకు శ్రీకృష్ణుడు అవతరించాడు. జన్మించిన వెంటనే వసుదేవుడు బాలకృష్ణుడిని యమునా నది దాటి గోకులంలోని నందయశోదల ఇంటికి చేర్చాడు. అక్కడ పెరిగిన బాలకృష్ణుడు తన చిలిపి చేష్టలు, వెన్న దొంగతనాలు, గోపికలతో ఆటపాటలతో అందరి మనసులను గెలుచుకున్నాడు.
శ్రీకృష్ణుడి జీవితం కేవలం అద్భుతాలు, లీలల సమాహారం మాత్రమే కాదు. ప్రతి దశలోనూ మానవాళికి ఒక గొప్ప సందేశాన్ని అందించింది. గోవర్ధనగిరిని ఎత్తి ప్రజలను రక్షించడం ద్వారా ప్రకృతిని గౌరవించాల్సిన అవసరాన్ని తెలియజేశాడు. కాళీయ మర్దనం ద్వారా చెడుపై మంచి సాధించే విజయాన్ని చాటిచెప్పాడు. స్నేహానికి ప్రతీకగా కుచేలుడితో ఆయన అనుబంధం చిరస్థాయిగా నిలిచింది.మహాభారత యుద్ధ సమయంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన గీతోపదేశం ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచింది. "ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి" అనే కర్మయోగ సందేశం నేటికీ ప్రతి మనిషి జీవితానికి అన్వయించదగినది. పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నా ధర్మాన్ని విడిచిపెట్టకూడదని, సత్యం కోసం నిలబడాలని భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు బోధించాడు.
కృష్ణాష్టమి రోజున దేశవ్యాప్తంగా ఆలయాలు ప్రత్యేకంగా అలంకరించబడతాయి. భక్తులు ఉపవాసాలు పాటిస్తూ శ్రీకృష్ణునికి పూజలు చేస్తారు. చిన్నారులను బాలకృష్ణుడు, రాధ వేషధారణల్లో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇళ్ల ముందు చిన్న చిన్న కృష్ణపాదాలను వేసి, బాలగోపాలుడు తమ ఇంటికి వస్తున్నాడనే భావనతో భక్తులు ఆనందంగా పండుగను జరుపుకుంటారు. ఉట్టి కొట్టడం వంటి సంప్రదాయ కార్యక్రమాలు కూడా కృష్ణాష్టమి వేడుకల్లో ప్రత్యేకతను సంతరించుకుంటాయి.
శ్రీకృష్ణుడి జీవితాన్ని మనం పరిశీలిస్తే ప్రేమ, స్నేహం, ధైర్యం, వివేకం, ధర్మం, కర్తవ్యనిష్ఠ వంటి ఎన్నో విలువలు కనిపిస్తాయి. అందుకే కృష్ణాష్టమి అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు; మన జీవితాన్ని సన్మార్గంలో నడిపించే విలువలను గుర్తుచేసుకునే పవిత్ర సందర్భం.
ఈ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని బోధనలను ఆచరిస్తూ, ప్రేమతో జీవిస్తూ, ధర్మం వైపు అడుగులు వేయడమే ఆయనకు మనం అందించే నిజమైన భక్తి.
"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే."